క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐలు రామకృష్ణ, అప్పలనాయుడు తదితరులు

సాలూరు: ప్రజలు వడదెబ్బ తగులకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సాలూరు పట్టణ,రూరల్ సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వారు పాల్గొన్నారు. మజ్జిగను పలువురు ప్రజలకు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో ఈ చలివేంద్రాలు ఎంతో అవసరమన్నారు.పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలకు చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు.కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, సభ్యులు దిలీప్‌కుమార్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తక్షణమే చెల్లింపులు

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురంటౌన్: పట్టణంలోని బెలగాంకు చెందిన గొబ్బి సరస్వతి తనకు హౌసింగ్ బిల్లు కావాలంటూ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చింది. ఎన్నికల కోడ్ కారణంగా పీజీఆర్ఎస్ రద్దు చేయడంతో ఆమె ఇంటికి వెళ్లి పోయింది. ఈ అంశంపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో హౌసింగ్ బిల్లు ఇవ్వండి సారూ.. అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ మేరకు బుధవారం హౌసింగ్ అధికారులు స్పందిస్తూ ఆమెకు గతంలో 2014-15 పథకం కింద ఇల్లు మంజూరైందని తెలిపారు. అప్పట్లో ఆర్‌సీపీ స్థాయి వరకు నిర్మాణం చేపట్టగా వాటి బిల్లులు చెల్లింపు చేసినట్లు చెప్పారు. 2006-14 సంవత్సరాలకు సంబంధించి పాత గృహ నిర్మాణ పథకానికి తదుపరి బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే బిల్లుల చెల్లింపు చేస్తామని తెలిపారు.

మహిళా సంఘాల వివరాలు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

పార్వతీపురంటౌన్: మహిళా సంఘాల సభ్యుల వివరాలు నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ సుధారాణి అన్నారు. ఈ మేరకు బుధవారం వెలుగు కార్యాలయంలో వీఓఏలతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల లావాదేవీలు, అప్పులు, పొదుపు, లోన్ వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క సభ్యురాలు, గ్రామసంఘాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 30 లోగా వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీఎం అప్పారావు, ఏపీఎం సింహాచలం, వీఓఏలు, సీసీలు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

నేడు రిజర్వ్ కేటగిరి మద్యం షాపుల కేటాయింపు



ఎక్సైజ్ ఈఎస్ బి.శ్రీనాథుడు

పార్వతీపురంటౌన్/ పార్వతీపురం: రిజర్వ్ కేటగిరి మద్యం షాపులను గురువారం డ్రా విధానం ద్వారా కేటాయించనున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ బి.శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సాలూరు, పార్వతీపురం, వీరఘట్టం, పాలకొండలో గీత, సొండి కులాలకు సంబంధించి మొత్తం దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. షాపుల వారీగా డ్రా విధానం ఉంటుందని చెప్పారు. పార్వతీపురం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో డ్రా తీస్తున్నామని, దరఖాస్తుదారులంతా ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

పుచ్చ..ఆరోగ్యానికి భలే రక్ష

- వేసవిలో దాహార్తి తీర్చే దివ్యఫలం
- కిలో రూ.25కు లభ్యం
- దారి పొడవునా విక్రయాలు
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు



విక్రయానికి సిద్ధం చేసిన పుచ్చకాయ ముక్కలు



పార్వతీపురం జిల్లా పరిసర ప్రాంతాల్లో పుచ్చకాయ పంట

పార్వతీపురం:

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పదిగంటలు దాటితే చాలు వేడిగాలులు వీస్తున్నాయి. అత్యవసర ప్రయాణాలు చేసే ప్రయాణికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులకు పాట్లు తప్పడం లేదు. ఈ సమయంలో దారిపొడవునా నేనున్నానంటూ అటు దాహార్తిని, ఇటు ఆకలిని తీరుస్తోంది పుచ్చకాయ. సాధారణ వ్యక్తి కూడా కొనుక్కుని తినగలిగే దివ్యఫలంగా పుచ్చకాయ అన్ని ప్రాంతాల్లో చరిత్రకెక్కుతోంది.

● దారిపొడవునా విక్రయాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో రోడ్డు పక్కన స్టాల్స్, వ్యాపారాలు పెరుగుతున్నాయి. పార్వతీపురం జిల్లా కేంద్రం కావడంతో అటు పాలకొండ నుంచి ఇటు సాలూరు వరకూ ప్రధాన రహదారి వ్యాపారాలతో నిండిపోతోంది. ప్రధానంగా చిరు వ్యాపారులు పండ్ల వ్యాపారాలపై దృష్టిసారిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో రోడ్డు పక్కన వ్యాపారాల్లో అధికంగా పుచ్చకాయల వ్యాపారమే ఎక్కువగా కనిపిస్తోంది.

● సరసరమైన ధరలలో..

ఈ ప్రాంతంలో నీలం రంగుచారలతో లేత ఆకుపచ్చ రంగులో కాయలు పండుతాయి. వాటిలో తియ్యదనం తక్కువైనప్పటికీ వేసవిలో మాత్రం ఎంతో దాహార్తిని తీర్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం వాటి ధర కిలో రూ.20నుంచి రూ.25లు పలుకుతోంది. అలాగే అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పుచ్చకాయలు ఈ ప్రాంతానికి దిగుమతి అవుతున్నాయి. ఇవి మన ప్రాంతంలో పండే పంట కంటే కాస్తా పెద్దవిగా, ముదురు నీలిరంగులో ఉంటాయి. వాటి లోపల గుజ్జు బాగా ఎర్రగా ఉండడంతో పాటు తియ్యదనాన్ని కలిగి ఉంటాయి. ఇవి కూడా కిలో రూ.25 చొప్పున మార్కెట్‌లో లభిస్తున్నాయి.

● శుభకార్యక్రమాలలో



పుచ్చకాయ అంటే ఇష్టపడని వారుండరు. చిన్నవారి నుంచి వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ పుచ్చకాయను తింటారు. ఇప్పుడు కొత్తగా వివాహాలు, శుభ కార్యక్రమాలు జరిగిన సందర్భాల్లోనూ తమ ఇండ్ల వద్ద నిర్వహించే ఫంక్షన్‌లలో పుచ్చకాయలను ముక్కలుగా కోసి వచ్చేవారికి ఇస్తున్నారు.

● ఆరోగ్యఫల ప్రదాయిని..

పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మంచిది. దాహాన్ని తగ్గిస్తుంది. చెమట ద్వారా వచ్చే ఖనిజ లవణాల లోపాలను పుచ్చకాయ తగ్గిస్తుంది. జ్వరంతో బాధపడుతున్నవారు పుచ్చకాయ రసంలో తేనె కలిపి సేవిస్తే శారీరక నీరసం తగ్గి శక్తి వస్తుంది. మలబద్ధకం ఉన్నవారు ప్రతిరోజూ పుచ్చకాయ సమస్య అంతరించిపోతుంది. ఎండిపోయిన పెదవులు తడిగా ఉంచుతుంది. పుచ్చకాయలో ఉన్నంత నీరు మరే పండులోనూ ఉండదు. మూత్ర విసర్జనలో మంట ఉన్నవారికి పుచ్చకాయ రసంలో స్పూన్ తేనె కలిపి ప్రతిరోజూ తీసుకుంటే గుండెజబ్బులు, మూత్ర పిండాల వ్యాధులు తగ్గిపోతాయి.

సీజనల్ వ్యాపారం

ఏడాదిలో మూడు నెలల పాటు పుచ్చకాయల వ్యాపారం ఉంటుంది. ఈ ప్రాంతంతో పాటు ఇతర జిల్లాల నుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకుంటున్నాం. ధర అందరికీ అందుబాటులో ఉంటుంది. ఎండ సమయంలో ముక్కలుగా కోసి ఉంచితే అమ్ముడైపోతాయి.

– కె.గాంధీ, వ్యాపారి, పార్వతీపురం

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి
- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 14 మందికి రూ.1,40,000 ఫైన్

పార్వతీపురం రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన నేరాన్ని న్యాయస్థానాలు తీవ్రంగా పరిగణించనున్నాయని, ఇటీవల వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.పదివేలు చొప్పున జరిమానా విధించాయని ఎస్పీ తెలిపారు. పార్వతీపురం టౌన్ సీఐ మురళీధర్ నేతృత్వంలో రెండు రోజుల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారికోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా, ఈ డ్రైవ్‌లో రెండు రోజులలో 14 మంది పట్టుబడడంతో వారిని జిల్లా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 14 మందికి జరిమానాను విధించినట్లు ఎస్పీ తెలిపారు. రెండోసారి మద్యం సేవించి వాహనాన్ని నడిపి దొరికినట్లయితే మూడు నెలల జైలుశిక్ష విధించనున్నట్లు న్యాయమూర్తి హెచ్చరించినట్లు సీఐ స్పష్టం చేశారు.

రైతు వ్యతిరేక విధానాలు ఆపండి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

- కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ధర్నా

పార్వతీపురం టౌన్: రైతాంగానికి, వ్యవసాయ రంగానికి నష్టం చేసే కేంద్ర ప్రభుత్వం విధానాలు వెనక్కి తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ డిమాండ్ చేశారు. లేదంటే మరోసారి ఢిల్లీ తరహా పోరాటం తప్పదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని పంటలకు సీ2+50 శాతం ప్రకారం పార్లమెంట్‌లో మద్దతు ధరల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలురైతులు వ్యవసాయ కార్మికులకు రుణమాఫీ చేయాలని, 60ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తేవాలని కోరారు. విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించి, స్మార్ట్ మీటర్ విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. ధరల స్థిరీకరణ నిధిని పునరుద్ధరించాలని కోరారు. అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకురాలు పి.రమణి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ బి.దాసు, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు పి.శ్రీనునాయుడు, యు.ముత్యాలు, ఎం.భాస్కర్ రావు (బాషా)అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు జె.ముత్యాలు, ఏపీ రైతు సంఘం నాయకుడు రెడ్డి ఈశ్వరావు, అయ్యరకుల సంఘం నాయకులు ఎస్.ఆదినారాయణ, జి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు చదువే ఆయుధం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో అనంతలక్ష్మి

మక్కువ: ఆడపిల్లలకు చదువు ఆయుధం వంటిదని పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి.అనంతలక్ష్మి అన్నారు. ఈ మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మక్కువ మండలంలోని కాశీపట్నం కేజీబీవీలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను మంచి చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. చదువు అనేది జీవితంలో ఎంతో ముఖ్యమైనదన్నారు. చదువుల్లో ఆడపిల్లలు రాణించి మంచి ఉద్యోగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు. మహిళలకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి జి.నాగదుర్గ, సూపర్‌వైజర్ పి.రాజశ్రీ, మహిళా పోలీస్ రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పడ్డలకు 'బ్రూ'సెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: పశుసంవర్ధక శాఖ సీతానగరం సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న రెండు మండలాల రైతులు పెంపకం చేస్తున్న తెల్ల, నల్లజాతి పడ్డలకు 'బ్రూ'సెల్లా వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలని సీతానగరం డివిజన్ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం పశువైద్యాధికారులు, సిబ్బంది వేస్తున్న 'బ్రూ'సెల్లా వ్యాధి నిరోధక'టీకాల కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 4 నెలల నుంచి 8 నెలలవయస్సు లోపు ఉన్న ఆవు, గేదె పడ్డల పెంపకం దారులంతా ముందు జాగ్రత్తచర్యగా బ్రూ సెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు.

స్పందనకు మంగళం..!

- సచివాలయాల్లో ఆపివేసిన గ్రీవెన్స్‌సెల్ కార్యక్రమం
- గత్యంతరం లేక మండలానికి పరుగులు తీస్తున్న అర్జీదారులు
- మండలంలో కనిపించని అధికారులు



బలిజిపేట సచివాలయం

బలిజిపేట: ప్రజలకు జవాబుదారీగా అధికారులు ఉండాలని, పరిపాలన సౌలభ్యం, ప్రజాసమస్యలపై గ్రామస్థాయిలోనే పర్యవేక్షణ, పరిష్కారం నిమిత్తం గత ప్రభుత్వం సచివాలయ స్థాయిలో అమలు చేసిన స్పందన కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం హయాంలో మంగళం పాడేశారు. సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. అంతా ఇప్పుడు మండల కేంద్రాలకు మార్చేశారు. అక్కడ అధికారులు కనిపించరు, అర్జీదారులను పట్టించుకోరు, అర్జీలు ఎక్కడ ఉంటాయో తెలియదు, ఏ రోజున స్పందన నిర్వహిస్తారో ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం మూడుగంటల నుంచి నాలుగు గంటల వరకూ పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయంలో అధికారులంతా స్పందన కార్యక్రమానికి హాజరయ్యేవారు. గ్రామంలో ఏవిధమైన సమస్య ఉన్నా స్థానికంగా రోజూ గంటపాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించేవారు. గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటుచేయడంతో ప్రజలు కూడా దూరాభారం వెళ్లాల్సిన పనిలేకుండా అక్కడే అర్జీలు అందించేవారు. ఆర్థిక ఇబ్బందులు తీరి, సమయం ఆదా అయ్యేది. దీంతో మండలస్థాయి స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలకు ఎన్నో ఇబ్బందులు, సమస్యలు తీరేవి.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ స్థాయిలో స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికారు. ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. సచివాలయాల్లో ఎక్కడా ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. గ్రామస్థాయిలో స్పందన నిర్వహిం చకపోవడంతో ప్రజలు మండల స్థాయి స్పందనకు వెళ్లాల్సి వస్తుండడంతో అక్కడకు ఏం వెళ్తాం? ఎవరు ఉంటారు? ఎవరికి అర్జీలు ఇస్తాం, వాటిని ఎవరు పట్టించుకుంటారంటూ నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. గ్రామస్థాయిలో స్పందన నిర్వహిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరిగి ఉండేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చేసేది ఏం లేదు కనుకనే..!

కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు ప్రజలకు చేసింది ఏమీ లేనందున గ్రామస్థాయిలో స్పందన నిర్వహిస్తే సమస్యలు కోకొల్లలుగా వస్తాయనే భావనతో సచివాలయ స్థాయి స్పందనకు స్వస్తి పలికారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లకు దరఖాస్తులు, జీవనాధార సంబంధమైన, మౌలిక సదుపాయాల కల్పనకు, రైతులకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నందున సచివాలయ స్పందనకు చెల్లుచీటీ ఇచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామస్థాయిలో అర్జీదారుల సమస్యలు పేరుకుపోతున్నాయి.

సచివాలయాలలో స్పందన నిర్వహించాలి

గతంలో గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని ప్రతిరోజూ నిర్వహించేవారు. ఇప్పుడు అదిలేదు. మండలానికి వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని. సమయానికి అధికారులు అందుబాటులో ఉంటారో లేదో తెలియని పరిస్థితి.చాలా ఇబ్బందికరంగా ఉంది.

– సత్యంనాయుడు, వంతరాం, బలిజిపేట మండలం

బాలల కేంద్రాలను రిజిస్టర్ చేసుకోవాలి

పార్వతీపురం: జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాలను చట్టప్రకారం రిజిస్టర్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు-వీధి బాలల సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణాధికారి అల్లు సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు మార్చి 10వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలను హెచ్‌టీటీపీ://డబ్ల్యూడీసీడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చునన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పుట్టూరు గ్రామంలో గోశాలల నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమణమూర్తి

పార్వతీపురం రూరల్: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో మంజూరైన గోకులాలను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని పార్వతీపురం ఎంపీడీఓ జీవీ రమణమూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలో గల పుట్టూరు, మూడడ్ల వలస గ్రామాల్లో నిర్మిస్తున్న గోశాలల నిర్మాణాలను పరిశీలించారు. కాంట్రాక్టర్లు గోశాల నిర్మాణంలో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు.

మహిళా హక్కు చట్టానికి తూట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సంఘం నాయకురాలు ఇందిర

బలిజిపేట: మహిళలు పోరాడి సాధించుకున్న చట్టాలకు పాలకపార్టీలు తూట్లు పొడుస్తున్నాయని మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర విమర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బలిజిపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు నాయకురాలు దాలమ్మ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై వేధింపులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. సమానత్వం, మహిళా సాధికా రత ఎక్కడా కనిపించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. పోరాడి సాధించుకున్న మహిళల హక్కులు, చట్టాలకు పాలక పార్టీలు తూట్లు పొడుస్తున్నాయని ధ్వజమెత్తారు. పురుషులతో పాటు మహిళలకు సమాన స్థానం కల్పించాలని భారత రాజ్యాంగం పేర్కొన్నా అది కాగితాలకే పరిమితమైందని అసంతృప్తి వెళ్లగక్కారు. మహిళా కార్మికులు అన్ని విధాలా వేధింపులు ఎదుర్కొంటున్నా వారికి రక్షణ లేకుండా పోతోందన్నారు. మహిళా సాధికారత సాధించాలన్నా, సమానత్వం రావాల న్నా ప్రభుత్వ ఆలోచన విధానాలలో మార్పు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్సై రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, జయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

మహిళల హక్కుల అమలులో విఫలం

సీతానగరం: రాష్ట్రంలో మహిళల హక్కులు అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఐద్వా జిల్లా నాయకురాలు వి.రామలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు బుధవారం సీతానగరం మండలకేంద్రంలో ఐద్వా మండల నాయకురాలు కె. శైలజ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామలక్ష్మి మాట్లాడుతూ సమానత్వం సాధికారత పదాలకు అర్థం రాష్ట్రంలో అందని ద్రాక్షలా ఉందన్నారు. మహిళలు, చిన్నారులపై, పనిప్రదేశాల్లో లైంగికదాడులు పెచ్చరిల్లిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐద్వా మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సీతానగరం: మహిళా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పార్వతీపురం రూరల్:

అక్రమంగా 15 పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని మండలంలో పెదమరికి వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషి పేర్కొన్నారు. మానాపురం సంతకు పశువులను తరలిస్తుండగా మార్గమధ్యంలో పెదమరికి వద్ద తరలిస్తున్న వారితో పాటు బొలెరో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పార్వతీపురం రూరల్:

భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు కె.అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సంతోషి బుధవారం తెలిపారు. పార్వతీపురం మండలంలోని హిందూపురానికి చెందిన అనసూయకు సీతానగరం మండలం పాపమ్మవలసకు చెందిన చిన్నోడుతో వివాహమైంది. భర్త, కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.